

ఏరు దాటి తెప్ప తగలెయ్యడం చంద్రబాబు నైజం

హామీలు అమలు చేయలేమని సీఎం చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. - 8లో..



చేద్దాం చూద్దాం అనుకుంటే సస్పెన్షనే

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించకుంటే సస్పెండ్ చేస్తానని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30/20

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రాణం ఉన్నంత వరకు జగన్ వెంటే..

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సింగరాయకొండ: నా ప్రాణం ఉన్నంత వరకు జగన్ వెంటే ఉంటానని, అంతేతప్ప పార్టీ మారే ప్రసక్తే లేదని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు. సింగరాయకొండలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీ మారడం గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. కొందరు పనిగట్టుకుని తనను అప్రతిష్ట పాలు చేసేందుకే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఎవరికో ప్రచారం కోసం, ఎవరికో లబ్ధి కోసం తనపై బురదజల్లుతున్నారని, బట్టకాల్చి మొహంపై వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రాజకీయ భిక్ష పెట్టింది వైఎస్సార్ అని, తాను దళితుడిని అయినప్పటికీ తన వెన్నంటి ఉండి ఈ స్థాయికి తీసుకొచ్చిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. నాయకత్వానికి, దార్శనికతకు పెట్టింది పేరు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాజకీయాల్లో విలువలు ఉన్న నాయకుడని కొనియాడారు. జగన్ అంటే ఒక ధైర్యమని అన్నారు. ఎనిమిది నెలలకే నయవంచన చేసినట్లు గుర్తించి కూటమి పార్టీలను ప్రజలు అసహ్యించుకుంటుంటే తాను ఎందుకు పార్టీ మారతానంటూ ఆయన ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీలో అలజడి సృష్టించడమే పనిగా కొందరు పెట్టుకున్నారని విమర్శించారు. విజయసాయిరెడ్డి గొప్ప వ్యక్తి అని, వైఎస్సార్ సీపీకి ఆయన అందించిన సేవలు గొప్పవని అన్నారు. ఆయనను ఎప్పుడూ గౌరవిస్తామన్నారు. చంద్రబాబు లాంటి వ్యక్తే విజయసాయిరెడ్డి రాజీనామా వైఎస్సార్ సీపీ అంతర్గత వ్యవహారమని అంటే.. హోం మంత్రి అనిత మాత్రం నోరు పారేసుకోవటం ఆమె సంస్కారానికి నిదర్శనమని విమర్శించారు. జగన్‌కు ప్రజల అండదండలు ఎప్పుడూ ఉంటాయని వివరించారు. 2016లోనూ తనపై అసత్య ప్రచారం చేశారని, కానీ, పార్టీ మారలేదని, ఇప్పుడు కూడా అదే జరుగుతుందని సురేష్ అన్నారు.

నేడు ఉపాధ్యాయుల వివరాల్లో మార్పులు చేసుకోవాలి

ఒంగోలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, నగరపాలక సంస్థ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా పాఠశాల విద్యాశాఖ గౌరవ సంచాలకుల ఆదేశాల మేరకు వారి వివరాలను వ్యక్తిగత టీఐఎస్ (టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం) లాగిన్‌లో మార్పులు ఉంటే చేసుకోవాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం ఈ నెల 31వ తేదీ సాయంత్రం వరకు మాత్రమే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులంతా టీఐఎస్ లాగిన్‌లో సరిచూసుకుని ఏదైనా మార్పులుంటే సరిచేసుకోవాలన్నారు. వివరాలు పూర్తిగా నింపకుండా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు కూడా అన్ని వివరాలు నింపి సబ్మిట్ చేయాలని, వీటి ఆధారంగానే పదోన్నతులు, బదిలీలు ఉంటాయని డీఈఓ తెలిపారు.

రేపు సామాజిక పెన్షన్ల పంపిణీ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని 2,84,637 మంది లబ్ధిదారులకు సామాజిక పెన్షన్లను ఫిబ్రవరి 1వ తేదీ పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.123 కోట్ల 31 లక్షల 58 వేలను ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. గ్రామ, వార్డు, సచివాలయాల సిబ్బందితో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది కూడా పాల్గొని లబ్ధిదారులకు ఇంటి వద్దనే ఉదయం 5 గంటల నుంచి పెన్షన్లు పంపిణీ చేయాలని సూచించారు. అదే రోజు సాయంత్రానికి 99 శాతానికి పైగా పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఐవీఆర్‌ఎస్ పద్ధతిలో ఎవరైనా పెన్షన్‌దారులు సిబ్బందిపై ఫిర్యాదు చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పు

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలో ఫిబ్రవరి 4 నుంచి జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసి నూతన షెడ్యూల్ ప్రకారం 10 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏకేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.వి.ఎన్.రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన షెడ్యూల్ వివరాలను ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు వెంటనే విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. నూతన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 10న పేపరు-1, 11వ తేదీ పేపరు-2, 12న పేపరు-3, 13న మెథడాలజీ-1, 14న మెథడాలజీ-2 (ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ) పరీక్ష, 15న ఫిజికల్ సైన్స్ మెథడాలజీ పేపరు నిర్వహించేందుకు నూతన షెడ్యూల్ విడుదల చేసినట్లు తెలిపారు.

కరుణ కరువు!



కొందరు నడవలేరు.. ఇంకొందరు చూడలేరు..మరికొందరు మాట్లాడలేరు.. ఇలాంటి వివిధ సమస్యలతో బాధపడుతున్న విభిన్న ప్రతిభావంతులను కూటమి సర్కార్ నిర్లక్ష్యం చేస్తోంది. విధి వారిని చిన్నచూపు చూస్తే.. పాలకులు పట్టించుకోకుండా వేదనకు గురిచేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటుతున్నా ప్రభుత్వం వారి సంక్షేమాన్ని గాలికొదిలేసింది. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా చలనం కనిపించడంలేదు. వీరి ఆర్థికాభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన రుణాల రికవరీలోనూ ప్రస్తుతం అధికారులు చేతివాటం చూపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటు ప్రభుత్వం ఆదుకోకపోగా, అండగా నిలవాల్సిన అధికారుల వేధింపులతో వీరు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

- విభిన్న ప్రతిభావంతులను పట్టించుకోని పాలకులు
- 7 నెలలు గడుస్తున్నా రుణాల ఊసేలేదు
- రుణాల వసూలులో అధికారుల చేతివాటం
- వడ్డీ పేరుతో అదనంగా రూ.500 వసూలు
- అండగా నిలిచిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలో వివిధ సమస్యలతో బాధపడుతున్న విభిన్న ప్రతిభావంతులు 33,250 మంది ఉన్నారు. వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు పాలకులు ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. వారికి ఆర్థికంగా అండగా నిలిచి జీవనోపాధి మెరుగుపరిచేందుకు ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలి. కానీ, కూటమి సర్కార్ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా రుణాలు మంజూరు చేయలేదు. వారిని పట్టించుకున్న పాపానపోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ విభిన్న ప్రతిభావంతులకు లక్ష రూపాయల నుంచి 4 లక్షల రూపాయల వరకూ రుణాలు మంజూరు చేస్తుంది. జాతీయ దివ్యాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ 5 శాతం, లబ్ధిదారుని వాటాగా మరో 5 శాతం కలిపి లబ్ధిదారునికి రుణాల కింద ఆర్థిక సాయంగా అందిస్తుంది. తీసుకున్న రుణాలను 6 శాతం వడ్డీతో 60 నెలల పాటు లబ్ధిదారులు తిరిగి చెల్లించాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రుణాలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులను అన్ని రకాలుగా ఆదుకుంది. వారి జీవనోపాధి మెరుగుపరిచేందుకు రుణాలు కూడా మంజూరు చేసింది. 2023 సంవత్సరంలో 23 మందికి రూ.66.50 లక్షలు రుణం అందజేసింది. 2024లో రూ.1.26 కోట్ల రుణం మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే జిల్లా అధికారుల నిర్లక్ష్యం కారణంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగలేదు. అనంతరం సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో రుణాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సెప్టెంబర్ మాసంలో అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. 43 మందికి గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.26 కోట్లను అందజేశారు. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణాన్ని మంజూరు చేశారు. ఇది మినహా కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వీరిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఏడు నెలల పాలన పూర్తయినా ప్రభుత్వానికి తమ ఊసే లేకపోవడం దారుణమని విభిన్న ప్రతిభావంతుల సంఘ నేతలు విమర్శిస్తున్నారు.

రుణాల రికవరీలో అక్రమాలు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన రుణాల రికవరీలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తీసుకున్న రుణాలు లబ్ధిదారులు తిరిగి చెల్లించే సమయంలో తాము అందించిన 5 శాతం లబ్ధిదారుల వాటా మినహాయించి, మిగిలిన 95 శాతం రుణాలకు వడ్డీ కట్టించుకోవాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా అధికారులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతుల నుంచి వసూలు చేయాల్సిన దానికన్నా అదనంగా రూ.300 నుంచి రూ.500 వరకూ వడ్డీ పేరుతో వసూలు చేస్తున్నార్న విమర్శలున్నాయి. ఈ విషయంపై కలెక్టర్‌కు విభిన్న ప్రతిభావంతులు, సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణ అధికారిని నియమించారు.



విభిన్న ప్రతిభావంతుల శాఖ కార్యాలయం



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు (ఫైల్)

ఒక్క రుణం కూడా ఇవ్వని కూటమి సర్కార్



కూటమి ప్రభుత్వంలో ఇంత వరకూ ఒక్క రుణం కూడా విభిన్న ప్రతిభావంతులకు మంజూరు కాలేదు. గతంలోని రుణాలకు కూడా అధికంగా వడ్డీ వసూలు చేస్తున్నారు. ఫలితంగా విభిన్న ప్రతిభావంతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన్నట్లు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌కే కాలేషా, నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షుడు

సర్వర్ డౌన్..!

- ఫిబ్రవరి 1 నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
- ముందే చేయించుకునేందుకు ఒక్కసారిగా ఎగబడిన ప్రజలు
- జిల్లా వ్యాప్తంగా సర్వర్లు మొరాయించి నిలిచిన రిజిస్ట్రేషన్లు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గురువారం సర్వర్లు మొరాయించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి విలువలు పెంచుతుండటంతో రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెరగనున్నాయి. ఆదాయమే పరమావధిగా పెట్టుకున్న చంద్రబాబు ప్రభుత్వం.. స్థిరాస్థి విలువలను 40 నుంచి 50 శాతం వరకు పెంచుతోంది. ఇప్పటికే ఉన్న స్థిరాస్థి విలువలను అమాంతం పెంచుకుంటూ పోతున్న ప్రభుత్వ తీరును గమనించిన స్థిరాస్తుల క్రయవిక్రయదారులు జనవరి 31వ తేదీలోపు రిజిస్ట్రేషన్లు చేయించుకుందామని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎగబడ్డారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్లు మొండికేసి రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నెమ్మదించిన సర్వర్లు.. ఆరు గంటల నుంచి కొంచెం సహకరించటం ప్రారంభించాయి. దాంతో రాత్రి పొద్దుపోయేంత వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కొనసాగించాల్సి వచ్చింది. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో రోజువారీగా 300 నుంచి 400 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అలాంటిది గురువారం ఒక్కరోజే దాదాపు రెండింతలుగా డాక్యుమెంట్లు వచ్చిపడ్డాయి. రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో సర్వర్లు మొరాయించాయి. క్రయవిక్రయదారులు నానా అవస్థలు పడ్డారు. నేడు కూడా ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

హామీలు నెరవేర్చలేకపోతే దిగిపో..

- సీఎం పదవి నుంచి తప్పుకో..
- సూపర్-6 ఇవ్వలేం అన్నావంటే ప్రజలను వంచించడమే
- ఎన్నికల సమయంలో లెక్కలేనన్ని హామీలిచ్చి అధికారంలోకి వచ్చావు
- రాష్ట్ర ప్రజలు నిన్ను నమ్మి నిలువునా మోసపోయారు
- సీఎం చంద్రబాబుపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన చుండూరి రవిబాబు, నాయకులు

ఒంగోలు సబర్బన్: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతే ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపో చంద్రబాబు.. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి గురించి ఆమాత్రం తెలియకుండానే హామీలు గుప్పించావా అంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఒంగోలు నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నయవంచనను ఎండగట్టారు. లేనిపోని హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి ఇప్పుడు సూపర్-6 పథకాలు, ఇతర హామీలేమీ నెరవేర్చలేమని బహిరంగంగా ప్రకటిస్తావా.. ఇదేనా నీ సీనియార్టీ అంటూ నిలదీశారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి కూడా ఇలాగే చేశావని, ఇప్పుడు నాలుగోసారి కూడా చేతగాని హామీలిచ్చి నెరవేర్చలేకపోతున్నాను అని అంటున్నావంటే నీ అంత అసమర్థ ముఖ్యమంత్రి దేశ చరిత్రలోనే ఎవరూ లేరని విమర్శించారు. నిన్ను నమ్మి, నీ హామీలపై ఆశలు పెట్టుకుని ప్రజలు ఓట్లేస్తే.. నీ మోసపూరిత నైజాన్ని మరోసారి బట్టబయలు చేశావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు పథకాల అమలు కోసం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేశాడంటూ అసత్య ప్రచారాలు చేశావని, ఎన్నికల సమయంలో మాత్రం వైఎస్సార్ సీపీ కంటే ఎక్కువ హామీలిచ్చి ఇప్పుడు చేయలేను అంటున్నావంటే ప్రజలు పాత చంద్రబాబును మళ్లీ చూస్తూ ఛీ కొడుతున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రెండుసార్లు కరోనా వచ్చినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఒక్క సంక్షేమ పథకాన్నీ ఆపకుండా ప్రతి కుటుంబాన్నీ ఆదుకున్నారన్నారు. కానీ, ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలన్నీ ప్రస్తుతం ఏమయ్యాయంటూ నిలదీశారు. ఇదేనా నీ సీనియారిటీ, 45 సంవత్సరాల రాజకీయ ఇండస్ట్రీ అంటూ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిన్ను నమ్మి కాపుల ఓట్లేయిస్తే వాళ్లకు ఏం చేశావంటూ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కాపు నేస్తం కింద కాపులకు ఆర్థిక సాయాన్ని అందించారని గుర్తు చేశారు. మరిప్పుడు మీరు కాపులకు ఏం చేశారంటూ ప్రశ్నించారు.

విద్యార్థులు, మహిళలు, రైతులను నట్టేట ముంచావు...

సూపర్-6లో చెప్పిన పథకాలేమీ అమలు చేయకుండా రాష్ట్రంలోని విద్యార్థులు, మహిళలు, రైతులను నిలువునా చంద్రబాబు వంచించాడని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిన చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదని మండిపడ్డారు. మోసపూరిత హామీలిచ్చాను.. నెరవేర్చలేను అని రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలన్నారు. హామీలన్నీ నెరవేర్చు.. లేకుంటే సీఎం కుర్చీ నుంచి దిగిపో అని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబును మించిన ముఖ్యమంత్రి దేశంలోనే లేరన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా రైతులకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువత గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దావోస్ వెళ్లి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాకుండా వెనక్కు తిరిగి వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని విమర్శించారు. సంపద సృష్టిస్తానన్నావు, నువ్వు సృష్టించిన సంపద ఎక్కడ అంటూ బూచేపల్లి నిలదీశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి సంపద సృష్టించారని, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నగదు పంచారని గుర్తు చేశారు.

కార్యకర్తలనే వైఎస్సార్ సీపీ నమ్ముకుంటుంది...

కేవలం కార్యకర్తలనే వైఎస్సార్ సీపీ నమ్ముకుంటుందని బూచేపల్లి అన్నారు. పార్టీ మారిన బాలినేని శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ నుంచి కార్పొరేటర్లు, కేడర్‌ను పార్టీ నుంచి తీసుకెళ్తున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు బూచేపల్లి స్పందించారు. స్వార్థం కోసం కొంతమంది పార్టీ మారుతున్నారని అన్నారు. పార్టీ మారిన బాలినేని ఇప్పటి వరకు ఒంగోలు రాలేదన్నారు. ఆయన మాటలు నమ్మి ఎవరూ పార్టీ మారరని అన్నారు. కార్యకర్తలను, కేడర్‌ను నమ్ముకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నడుపుతున్నారన్నారు. ఒకరిద్దరు పార్టీ మారినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలను గెలిపించుకునే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు.

ప్రతి ఎన్నికల్లోనూ చంద్రబాబు అబద్ధాలు : చుండూరి రవిబాబు

చంద్రబాబు ప్రతి ఎన్నికల్లోనూ అబద్ధాలు చెప్పడమే పరమావధిగా పెట్టుకున్నారంటూ వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు విమర్శించారు. ఎన్నికల హామీలు అమలుచేయడం లేదని ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనని రోజుకొక కొత్త కథను చంద్రబాబు అల్లుతున్నాడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్, పార్టీ నాయకులు బొట్ల సుబ్బారావు, మీరావలి, డాక్టర్ నందకిషోర్, వడ్లమూడి నాని, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నాయకులు

ఫీజు పోరును విజయవంతం చేయండి

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీ ఒంగోలులోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఫీజు పోరు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలను నిలిపివేశారన్నారు. వాటిని ఇవ్వలేనని బహిరంగంగా సీఎం చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఫీజులివ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నందుకు నిరసనగా అన్ని వర్గాల ప్రజలతో పాటు విద్యార్థి విభాగాలతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు, విద్యార్థులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, నాయకులు దుంపా యలమందారెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, సూడిదేల విజయభాస్కర్‌రెడ్డి, కూడలి మాలకొండయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలికల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- మార్కాపురంలో అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన సబ్ కలెక్టర్ త్రివినాగ్, తదితరులు

మార్కాపురం: బాలికల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. గురువారం మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాలులో సబ్‌కలెక్టర్ వెంకట సహదిత్ త్రివినాగ్‌తో కలిసి బంగారు బాల్యం కార్యక్రమం అమలుపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలల సమగ్ర ఎదుగుదలకు అందరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలను నివారించి బాలికా సాధికారత దిశగా బంగారు బాల్యం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. బాలల హక్కులు, చట్టాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు నిరోధిస్తూనే పౌష్టికాహార లోపం నివారించే స్థాయి నుంచి బాలికల బంగారు భవిష్యత్తు అందించే వరకు అందరం కృషిచేద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. పాఠశాలల్లో విద్యార్థినుల డ్రాపవుట్స్ కూడా నివారించాలన్నారు. ఇందుకోసం జిల్లాలో ప్రతి పాఠశాలకు ఒక టీచరును నోడల్ ఆఫీసరుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు.పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హీనా సుజన్, డీసీపీఓ దినేష్‌కుమార్, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీల్, తహసీల్దార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టండి...

పశ్చిమ ప్రకాశంలోని ప్రజలకు వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి మార్కాపురంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌తో కలిసి తాగునీటి సమస్యపై సమీక్షించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రధానంగా ఫిబ్రవరి 1 నుంచి చేతిపంపుల మరమ్మతులను ప్రారంభించి 45 రోజుల్లో పూర్తిచేయాలని చెప్పారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సీపీడబ్ల్యూఎస్, ఎంపీడబ్ల్యూఎస్, తదితర పథకాల కింద ఉన్న చేతిపంపులను గుర్తించి వాటికి అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాలో అవకతవకలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించిన బిల్లులు త్వరగా చెల్లించేలా చూడాలని, ఈ వివరాలన్నీ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరాలో అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఎస్‌ఈ బాలశంకర్, డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి, మార్కాపురం మున్సిపల్ కమిషనరు నారాయణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈఓపీఆర్‌డీలు పాల్గొన్నారు.

లక్ష మందికి గోకులం షెడ్లు నిర్మించాలి

- ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ డిమాండ్



గొర్రెలు, మేకల పెంపకందారులతో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్

టంగుటూరు: గొర్రెలు, మేకల పెంపకందారులు, సభ్యులకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి షెడ్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం టంగుటూరు మండలం శివపురం, టంగుటూరు గ్రామాల్లో పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గొర్రెలు, మేకల వృత్తిపై ఆధారపడి ఐదు లక్షల మంది జీవిస్తున్నారని తెలిపారు. కానీ, ప్రభుత్వం నామమాత్రంగా ఊరికి ఒకటి చొప్పున షెడ్లు నిర్మిస్తోందన్నారు. ఒక ఊరులో 20 నుంచి వంద మంది వరకు పెంపకందారులు ఉంటారని, వారందరికీ విడతల వారీగా షెడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 20 వేల మంది గొర్రెలు, మేకల పెంపకందారులు ఉండగా, కేవలం వందల్లో మాత్రమే ఇచ్చారని, దీంతో మిగతా పెంపకందారులు నిరాశ చెందుతున్నారని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని, ప్రత్యేకంగా షెడ్లు కేటాయించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా యాక్సిడెంట్లు, వివిధ రకాల జబ్బులు, ప్రకృతి వైపరీత్యాలు జరగడం వలన వందలాది జీవాలు చనిపోయి పెంపకందారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం పశు నష్ట పరిహార పథకం ద్వారా పరిహారం ఇచ్చేదని, దానిని మధ్యలో నిలుపుదల చేసిందని, దీంతో పెద్ద ఎత్తున పెంపకందారులకు జీవనోపాధి కోల్పోయి తీవ్ర నష్టం జరిగిందని వివరించారు. ఈ పథకాన్ని వెంటనే పునరుద్ధరించి అన్ని జీవాలకు ప్రభుత్వమే ఉచితంగా బీమా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు, ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడు బుర్రా శ్రీరాములు, డి.రమణయ్య సభ్యులు బుర్ర వెంకట్రావు, చావలి వెంకటేశ్వర్లు, కొండ చినజాలయ్య, చావలి శ్రీనివాసులు, కటారి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముడి దారి దోపిడీ నిజమే



ఆక్రమిత స్థలంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

మద్దిపూడి: ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మద్దిపూడి రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండలంలోని గార్లపేట గ్రామంలో వంక పోరంబోకు భూమి ఆక్రమణపై ఈనెల 29న 'తెలుగు తమ్ముడి దారి దోపిడీ' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఆక్రమిత స్థలాన్ని తహసీల్దార్ జ్వాల నరసింహారావు, ఆర్ఐ బత్తుల శ్రీనివాసరావు, వీఆర్ఓ సుబ్బారెడ్డి, మండల సర్వేయర్ బాల వెంకటరెడ్డి, కృష్ణచైతన్య కుమార్ పరిశీలించారు. ప్రభుత్వ స్థలంగా నిర్ధారించిన రెవెన్యూ అధికారులు ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలో సంబంధిత స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తితో ఇకపై ఆ భూమి జోలికి వెళ్లబోనని లిఖిత పూర్వకంగా హామీ తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఏరు దాటి తెప్ప తగలెయ్యడం

చంద్రబాబు నైజం

- ఎన్నికల హామీలను 'కూటమి' సర్కారు అమలు చేయాలి
- విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించేలా ప్రభుత్వ నిర్ణయాలు
- రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రత్యేక విమానాల్లో దావోస్ వెళ్లి ఏం చేశారు?
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ:

సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టేందుకు చంద్రబాబు, కూటమి ప్రభుత్వ భాగస్వాములు ప్రయత్నించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్చార్జి ఆదిమూలపు సురేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని సచివాలయం సాక్షిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఏరు దాటాక తెప్ప తగలెయ్యడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు చంద్రబాబు మాటలతో అడియాసలయ్యాయన్నారు. కొండపిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదిమూలపు సురేష్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. సార్వత్రిక ఎన్నికల వేళ కూటమి ప్రభుత్వ నేతలు సూపర్ సిక్స్‌తో పాటు 31 సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి 8 నెలలైనా ఒక్కటీ సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకొనే చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా హామీలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ వల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నదని, సంక్షేమ పథకాలు అమలు చేయడం కుదరదని చెప్పడం ఆయన దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే కూటమి మెడలు వంచుతామని హెచ్చరించారు. హామీలు అమలు చేయకుంటే కాలర్ పట్టుకుని నిలదీయాలని నారా లోకేష్ చెప్పారని ఇప్పుడు ఎవరు కాలర్ పట్టించుకోవాలో లోకేష్, చంద్రబాబు తేల్చుకోవాలన్నారు.

'అప్పు'లపై అబద్ధాల దప్పు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.14 లక్షల కోట్ల అప్పు చేశారని, మరో శ్రీలంకలా మారుతుందని చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ విష ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర అప్పులపై గవర్నర్‌తో సైతం రూ.9 లక్షల కోట్ల అని అబద్ధాలు చెప్పించి, బడ్జెట్ సమయంలో అసెంబ్లీ సాక్షిగా రూ.6 లక్షల కోట్లు అని ప్రకటించారన్నారు. చంద్రబాబు గత 8 నెలల్లో 1.15 లక్షల కోట్లు అప్పు చేశారని, ఇప్పుడు రాష్ట్రం మరో శ్రీలంక కాదా అని ఎండగట్టారు.

ఐదేళ్లలో ఏం చేస్తారో చెప్పాలి కానీ..

చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధికి ఏం చేస్తారో చెప్పకుండా విజన్–2047 పేరుతో మోసానికి తెరతీశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి రేటు 15 శాతానికి పెరిగితే సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చెబుతున్నారని, అది ఎప్పటికి జరుగుతుందో అందుకు ఏ ప్రణాళికలు సిద్ధం చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఎంత సేపటికీ సంపద సృష్టిస్తానని చెబుతున్నది ప్రజలకా లేక తన పార్టీ కార్యకర్తలకా అనేది అర్థం కావడం లేదన్నారు. వైఎస్ జగన్ పాలనలో సీ పోర్టులు, హార్బర్లు, మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే వాటిని చంద్రబాబు తెగనమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ఫీజు బకాయిలు ఎప్పుడిస్తారు?

2019లో చంద్రబాబు దిగిపోతూ రూ.2 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు పెడితే వాటిని వైఎస్ జగన్ చెల్లించడం వాస్తవం కాదా అని కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను ప్రతి 3 నెలలకు ఒకసారి చెల్లించామని గుర్తు చేశారు. కూటమి వచ్చాక ఫీజు బకాయిలు చెల్లించకపోగా విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని ధ్వజమెత్తారు. విద్యార్థుల పక్షాన వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న ఫీజు పోరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దావోస్ సమ్మిట్‌లో పక్క రాష్ట్రాలు తెలంగాణ, మహారాష్ట్ర రూ.లక్షల కోట్ల ఒప్పందాలు చేసుకుంటే ప్రత్యేక విమానంలో వెళ్లిన చంద్రబాబు ఒక్క ఒప్పందం లేకుండా ఉత్తి చేతులతో వచ్చారని ఎద్దేవా చేశారు.

పార్టీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకట్రావ్, మసనం వెంకట్రావ్, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జరుగుమల్లి మండల అధ్యక్షుడు బత్తిన మదన మనోహర్‌రావు, పిన్నిక శ్రీనివాసరావు, చుండి శ్రీనివాసులు, చుండూరి సురేష్, షేక్ కరీం, సోమిశెట్టి సురేష్, గాదంశెట్టి గుప్తా, పిట్టా బ్రహ్మయ్య, షేక్ రహీం, తంబు రఘురామయ్య, మాదాల శంకర్, షేక్ జిలాని, షేక్ ఆబిద్ ఆలీ, షేక్ అల్లాభక్షు, పీవీ రెడ్డి, పాకనాటి రమణారెడ్డి, కె మధుసూదన రావు, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేద్దాం చూద్దాం అనుకుంటే సస్పెన్షనే

- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ హెచ్చరిక
- తర్లుపాడులో అర్జీదారుతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్
- కొనకనమిట్లలో సదస్సులు ముగిసి 20 రోజులైనా అర్జీల పెండింగ్‌పై ఆగ్రహం
- ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఆరా



తర్లుపాడులో రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తర్లుపాడు: అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా చేద్దాం.. చూద్దాం.. అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తానని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించారు. గురువారం తర్లుపాడు రెవెన్యూ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌తో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై సమీక్షించారు. నిర్దిష్ట గడువులోగా అర్జీలను ఎందుకు పరిష్కరించలేదంటూ తహసీల్దార్ విజయభాస్కర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓ అర్జీదారుతో కలెక్టర్ నేరుగా ఫోనులో మాట్లాడారు. అధికారులు మీతో మాట్లాడారా? సమస్య అడిగి తెలుసుకున్నారా? అంటూ ఆరాతీశారు. 'ఈ ఒక్కరితోనే ముగించను అర్జీదారులకు ర్యాండమ్‌గా ఫోన్ చేస్తా' అని స్పష్టం చేశారు. కాగా, కలెక్టర్ వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న అర్జీదారులు పలువురు హుటాహుటిన తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తమ సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పలువురు తమ సమస్యలపై అర్జీలివ్వగా త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, వీఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

20 రోజులుగా ఏం చేస్తున్నారు.

కొనకనమిట్ల: రెవెన్యూ సదస్సులు ముగిసి 20 రోజులు దాటినా ఇప్పటి వరకు సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని కొనకనమిట్ల రెవెన్యూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనకనమిట్ల రెవెన్యూ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారని ప్రశ్నించగా డిప్యూటీ తహసీల్దార్ సరైన సమాధానం చెప్పకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. భూ ఆక్రమణలపైనా కలెక్టర్ ఆరా తీశారు. తనిఖీ సమయంలో తహసీల్దార్ సురేష్ లేకపోవడాన్ని కలెక్టర్ ప్రశ్నించగా ఫీల్డ్ పనిపై వెళ్లారని ఉద్యోగులు చెప్పారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా పెండింగ్ అర్జీలు వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

రుద్రసముద్రం బాధితులకు

న్యాయం చేయాలి

- గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో ఎస్టీ దంపతులకు న్యాయం చేయాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అధికారులను కోరారు. ఈ నెల 17వ తేదీ ఎస్టీ కులానికి చెందిన మాట వెంకటేశ్వర్లు, శివమ్మ దంపతులను అగ్రకులం వారు కులం పేరుతో దూషించి వారి జీవనోపాధి అయిన ఆటో, ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేసి కోళ్లఫారం షెడ్‌కు నిప్పుపెట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ గురువారం రుద్రసముద్రం వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్నారు. తమ కుటుంబాన్ని గ్రామంలోని అగ్రకులం వారు ఇబ్బంది పెడుతున్నారని, సుమారు 50 మంది వచ్చి తమపై దాడి చేశారని, పోలీసులు ఒకరిపై మాత్రమే కేసు నమోదు చేశారని బాధితులు వాపోయారు. తాము ఎస్టీ కులానికి చెందిన వారిమని, కులం పేరుతో దూషించారని, మీరు గ్రామంలో ఉండటానికి వీల్లేదంటూ ఇబ్బంది పెడుతున్నారంటూ శివమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. స్పందించిన శంకర్ నాయక్ మాట్లాడుతూ నష్ట పరిహారం వచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడతామని, ప్రస్తుతానికి ముగ్గురు బాధితులకు మనిషికి రూ.50 వేల చొప్పున రూ.లక్షన్నర వచ్చేలా చూడాలని తహసీల్దార్ రమాదేవికి సూచించారు. ఆ తర్వాత మనిషికి రూ.1.50 లక్షల చొప్పున రూ.4.50 లక్షలు ప్రభుత్వం నుంచి వచ్చేలా చూసి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. డీఆర్‌ఓతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి త్వరగా నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. పోలీసులు తమకు సహకరించడంలేదని, డీఎస్పీ బి.లక్ష్మీనారాయణను తొలగించి కొత్త వారిని నియమించాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. దీనిపై వెంటనే ఎస్పీతో ఫోన్‌లో శంకర్ నాయక్ మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని, డీఎస్పీని వెంటనే రుద్రసముద్రం పంపించాలని కోరారు. అనంతరం విలేకరులతో శంకర్ నాయక్ మాట్లాడుతూ పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, లేకుంటే పోలీసులపై తగిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు పోతామని హెచ్చరించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఆటోకు నష్టపరిహారం అందించేలా చూస్తానని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. 2 బస్తాల బియ్యం, కందిపప్పు, ఇతర సరుకులను బాధిత కుటుంబానికి అందజేశారు. ఆయన వెంట గిరిజన ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆర్.సైదానాయక్, గిరిజన ప్రజా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పేరం సత్యం, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌కుమార్ ధర్మా, యానాది పోరాట సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమాధికారి బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో టోర్నమెంట్లో నాగ ప్రజ్వత్ ప్రతిభ



జూడోలో ప్రతిభ కనబరిచిన నాగ ప్రజ్వత్

టంగుటూరు: నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో టోర్నమెంట్లో ప్రకాశం జిల్లా జట్టు తరఫున రాష్ట్ర స్థాయి కాడెట్ విభాగంలో టంగుటూరుకు చెందిన పదో తరగతి విద్యార్థి మద్దిరాల నాగ ప్రజ్వత్ ప్రతిభ చూపాడు. 50 కిలోల లోపు విభాగంలో పాల్గొని కన్సోలేషన్ బహుమతి, రాష్ట్ర స్థాయి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ పొందాడు.

ఉరేసుకుని జార్ఖండ్ యువకుడు మృతి

మద్దిపాడు: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. మద్దిపాడు ఎస్సై శివరామయ్య కథనం ప్రకారం.. గ్రోత్ సెంటర్‌లో గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న చందన్ ప్రసాద్ యాదవ్(20) అతని గదిలోనే బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఉరివేసుకున్నాడు. అతని తమ్ముడు రాజ్ కిషోర్ యాదవ్ గమనించి తలుపులు పగలగొట్టి ఒంగోలు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. చందన్ ప్రసాద్ యాదవ్ తరచూ తన కుటుంబ ఆర్థిక పరిస్థితి, తల్లిదండ్రులను తలచుకుని బాధపడుతూ ఉండేవాడని అతని సోదరుడు చెప్పాడు.

పోలీస్ స్టేషన్ సమీపంలో చోరీ



దొంగలు పగలగొట్టిన బీరువా

దొనకొండ: స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ముస్లిం బజారులో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. షేక్ పాపా కుటుంబ సమేతంగా 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి విజయవాడకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు బుధవారం రాత్రి వెనుక వైపు గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉంచిన చెవి కమ్మలు, 20 తులాల వెండి పట్టీలు, వెండి గిన్నెలు, రూ.5 వేల నగదు, విలువైన దుస్తులు మొత్తం రూ.లక్ష విలువైన సొత్తు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్ట్

- 340 గ్రాముల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన కనిగిరి డీఎస్పీ యశ్వంత్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

కనిగిరి రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను స్థానిక సీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ వెల్లడించారు. పట్టణంలోని మంచి నీటి చెరువు ప్రాంతంలో గల బ్రహ్మంగారి గుడి వద్ద పాతూరుకు చెందిన నాగులూరి అంకబాబు, నాగులూరి వెంకటేశ్వర్లు గంజాయి విక్రయిస్తున్నారు. సమాచారం అందడంతో కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి, పీసీపల్లి ఎస్సై తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. పాదిలికి చెందిన రమేష్, సాయి అనే వ్యక్తుల వద్ద ఇద్దరు నిందితులు 350 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. వాటిని చిన్న, చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కొక్కటి రూ.150కు అమ్మేందుకు సిద్ధం చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, 340 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితులు రమేష్, సాయిని అరెస్టు చేయనున్నట్లు చెప్పారు. నిందితులను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, పీసీపల్లి ఎస్సై, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఉర్దూ పాఠశాలలను

అనుసంధానం చేయవద్దు



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

ఒంగోలు సిటీ: జీవో 117 రద్దు అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల పునర్నిర్మాణంలో భాగంగా ఉర్దూ పాఠశాలలను, ఉర్దూ సెక్షన్ పాఠశాలల తరగతులను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలుగు, ఆంగ్ల మాధ్యమ, మోడల్ స్కూళ్లతో అనుసంధానం చేయవద్దని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ అన్వర్‌బాషా, ప్రధాన కార్యదర్శి ఎండీ సనావుల్లా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డీఈఓ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. ఉర్దూ మీడియం పాఠశాలల్లో పీపీ–1, పీపీ–2 తరగతులు నిర్వహించి బలోపేతం చేయాలని కోరారు. ఉర్దూ పాఠశాలలకు ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:15 గా ఉంచాలని, 45 మంది విద్యార్థులుంటే మోడల్ స్కూల్‌గా గుర్తించాలన్నారు. 6, 7, 8 తరగతుల్లో 30 మంది విద్యార్థులుంటూ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. నిర్వహణ పరంగా కామన్ స్కూల్ కాంప్లెక్సుకు అనుసంధానం చేసినా, తరగతుల నిర్వహణను గతంలో మాదిరిగానే కొనసాగించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉర్దూ ఏఎంఓ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. డీఈఓ అప్రూవల్ గల ఉర్దూ భాషా పండిట్లకు పదోన్నతులు కల్పించి శాశ్వత స్థానాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సయ్యద్ సమీవుల్లా బాషా తదితరులు పాల్గొన్నారు.